

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -183 | పేజీలు - 8 | వెల - 03/- | సోమవారం 12 అక్టోబర్ 2026

అడవితల్లి బాటతో అభివృద్ధి భరోసా

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

గిరిజన గూడెంలో చింతచెట్టు కింద కూర్చుని ప్రజలతో మమేకం

- వైసీపీ మద్దతుదారులు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు కేటాయించామని వెల్లడి
- రూ.2,052 కోట్లతో 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి
- గత వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని పార్టీ రంగుల కోసం దుర్వినియోగం చేసిందని విమర్శ
- రాకోటలో 'మాటా-మంతి'.. గిరిజనుల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలు





రంపచోడవరం అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)


"వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం. మేం అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూస్తున్నాం. ఏ పార్టీ బతకాలనేది కాదు, వ్యవస్థలు బతకాలి, గ్రామాలు బాగుపడాలి, ప్రజల జీవితాలు మెరుగుపడాలి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత, వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకున్నాను" అని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని కాకవాడ గ్రామంలో "అడవితల్లి బాట 2.0" కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తాము బాధ్యతలు స్వీకరించాక వైసీపీ మిగతాది 2లో...

చెన్నైలో కొత్త మెట్రో

తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

- చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం
- జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్
- సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో 15 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మాణం
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం





చెన్నై అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు మిగతాది 2లో...

ప్రభుత్వం భయపడుతోంది..

- సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశామన్న అశుతోష్ రంకా
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషమని వ్యాఖ్య
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు



ఏపీలో అభివృద్ధి కనపడుతుంది

ఏపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించిన మెగాస్టార్



తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన చిరంజీవి

రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య

పవన్ శాఖకు దేశంలో మొదటి ర్యాంక్ వచ్చిందని వెల్లడి

కపిలేశ్వరపురం అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

మెగాస్టార్ చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఆయన కితాబిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వరపురం పర్యటన సందర్భంగా ఆయన స్థానికులతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఏపీలో పాలన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిగతాది 2లో...

విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష

- ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి
- దసరా సామాన్యుల పండుగలా జరగాలి, వీఐపీలదిగా కాదని స్పష్టం
- అక్టోబర్ 13 నుంచి జాతీయ స్థాయి సరస్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు
- విజయవాడ ఉత్సవ్ 2.0తో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని సూచన



విజయవాడ (రిపబ్లిక్ న్యూస్)

విజయవాడలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, త్వరలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0లను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమాల విజయానికి దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.

దసరా ఉత్సవాలు సామాన్యుల పండుగలా జరగాలని, వీఐపీల కోసం కాదని సీఎం స్పష్టం చేశారు. మిగతాది 2లో...



ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం..

యాసంగి సాగు వద్దు!

- రైతులకు మంత్రి పొంగులేటి సూచన
- సాగునీటితోపాటు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం
- నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

హైదరాబాద్,అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉందని, దీంతో సాగునీటితోపాటు తాగునీటి అవసరాలను తీర్చడం సవాలుగా మారవచ్చని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు మిగతాది 2లో...

ఆంక్షలు వద్దు

ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి.. : సుప్రీంకోర్టు

- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం

ఢిల్లీఅక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మిగతాది 2లో...





అక్టోబరు 12 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- అక్టోబరు 16న గరుడ వాహన సేవ, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరిగే ఉత్సవాలు
- అధికమాసం రావడంతో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు
- ఇటీవలే ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా గోవాలో రేవంత్ రెడ్డి ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు



అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్న్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతాది 2లో...

మిగతా2లో...

అడవితల్లి బాటతో అభివృద్ధి భరోసా

(మొదటి పేజి తరువాయి)

మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు విడుదల చేశామని, తమకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని తెలిపారు.ఈ సందర్భంగా రూ.2,052 కోట్ల అంచనా వ్యయంతో 2,569 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనలు నిర్మించనున్నట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజావసరాలు తీర్చాల్సిన వందల కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయడానికి, వాటిని తొలగించడానికి దుర్వినియోగం చేసిందని తీవ్రంగా విమర్శించారు. అదే నిధులతో ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి ఉండవచ్చన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ రోడ్లపైకి వచ్చి పోరాడిన జనసైనికులు, వీరమహిళల త్యాగాలను మరువలేమని అన్నారు. వారి త్యాగాలకు గుర్తింపుగా, పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన కార్యకర్తలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కూటమి నాయకులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఉండాలని ఆకాంక్షించారు.

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అని, కొండలను తొలచి, రాక్ కటింగ్ వంటి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తాము నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను స్థానిక ప్రజలే పర్యవేక్షించాలని కోరారు. ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉద్యానవనాల అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, మొబైల్ కనెక్టివిటీ వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అటవీ అనుమతులు వేగవంతం చేసి సెల్ టవర్లు, రహదారుల నిర్మాణాలను



పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కోరిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. అధికార అహంకారంతో ప్రజలను భయపెట్టే రోజులు పోయాయని, తప్పును ప్రశ్నించే ధైర్యంతో పాటు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు.

గిరిజన గూడెంలో చింతచెట్టు కింద కూర్చుని ప్రజలతో మమేకం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం గిరిజన గూడెంలో పర్యటించి, అడవి బిడ్డలతో మమేకమయ్యారు. మారుమూల గ్రామానికి స్వయంగా వెళ్లి, చింతచెట్టు కింద రచ్చబండపై కూర్చుని వారి సమస్యలను ఓపికగా విన్నారు. అక్కడికక్కడే పరిష్కారాలు చూపుతూ, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదేశాలు జారీ చేసి గిరిపుత్రుల్లో భరోసా నింపారు.పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని రాకోట గిరిశిఖర గ్రామంలో 'అడవి తల్లి బాట 2.0' కార్యక్రమానికి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాకవాడ, రాకోట, సువర్ణవాడ, వేములకొండ గ్రామాలను కలిపే 3.4 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2.29 కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఏర్పాటు చేసిన 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. రాకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ విద్య, వైద్య, మౌలిక వసతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ప్రజల వినతులపై తక్షణమే స్పందించిన పవన్ కల్యాణ్

శిథిలావస్థలో ఉన్న రాకోట పాఠశాల పునరుద్ధరణకు రూ. 20 లక్షలు, గ్రామ ఆరోగ్య కేంద్రానికి రూ. 15 లక్షలు, హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి వివిధ పథకాల కింద సుమారు రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

అంతకుముందు గ్రామానికి చేరుకున్న పవన్ కల్యాణ్‌కు గిరిజన మహిళలు పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వెదురు ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను కలిసి, ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను కూడా పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి నేరుగా తమ గ్రామానికి వచ్చి సమస్యలు తీర్చడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

అక్టోబరు 12 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల(రిపబ్లిక్ న్యూస్)

తిరుమల పుణ్యక్షేత్రం మరో ఉత్సవానికి సిద్ధమైంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అధికమాసం రావడం వల్ల ఈ ఏడాది స్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భాద్రపద మాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగియగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అక్టోబరు 11న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.సాధారణంగా చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చినప్పుడు కన్యామాసంలో (భాద్రపదం) వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం తిరుమల సంప్రదాయం. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. వార్షిక బ్రహ్మోత్సవాల తరహాలో వీటికి ధ్వజారోహణం, ధ్వజావరోహణం వంటి ఘట్టాలు ఉండవు. అంకురార్పణతో నేరుగా ఉత్సవాలు ప్రారంభమై, చక్రస్నానంతో పరిసమాప్తం అవుతాయి.ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఎదురుచూసే గరుడ వాహన సేవ అక్టోబరు 16న జరగనుంది. అలాగే, అక్టోబరు 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథం ఊరేగింపు, 20న చక్రస్నానం ఘట్టాలు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం వాహన సేవలు 8 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు విశేషంగా నిర్వహిస్తారు.

చెన్నైలో కొత్త మెట్రో

(మొదటి పేజి తరువాయి)

ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది.ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

ఆంక్షలు వద్దు

(మొదటి పేజి తరువాయి)

అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది.

ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

ఏపీలో అభివృద్ధి కనపడుతుంది

(మొదటి పేజి తరువాయి)

చాలా కాలం తర్వాత రాష్ట్రానికి వచ్చానని, ఇక్కడ పాలన ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నానని చిరంజీవి చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయని ప్రజలు తనకు చెప్పినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యంగా తన సోదరుడు పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ పనితీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో దేశవ్యాప్తంగా 23వ ర్యాంకులో ఉన్న పంచాయతీరాజ్ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకోవడం గర్వకారణమని అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పరోక్షంగా సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇలాగే మంచి జరగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు చిరంజీవి తెలిపారు.

తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్ఎల్ హాస్పిటల్, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్మించిన వైద్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చిరంజీవి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి ముదిరిన తర్వాతే చాలామంది మేల్కొంటున్నారని, లక్షణాలను ముందుగా గుర్తిస్తే సులభంగా కోలుకోవచ్చని సూచించారు. తన భార్య, సోదరి, తల్లికి క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయిస్తానని తెలిపారు. ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

నటుడు మురళీమోహన్ ఆరోగ్యాన్ని చూశాక, తాను కూడా మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని చిరంజీవి పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని వివరిస్తూ, తాను హైదరాబాద్ నుంచి గాజు వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటానని చెప్పారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరవడంతో మెగా అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన్ను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఛైర్మన్ గన్ని భాస్కర్ రావు, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జీవీబీ చౌదరి, పలువురు మంత్రులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

(మొదటి పేజి తరువాయి)

బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు.గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు.రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. యాసంగి సాగు వద్దు!

(మొదటి పేజి తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని, ఈ యాసంగిలో పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు.ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని కోరారు. వ్యవసాయ అవసరాలతోపాటు ప్రజల తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.విద్యుత్ వినియోగంలోనూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన మేరకే విద్యుత్‌ను ఉపయోగించాలని పొంగులేటి సూచించారు. భవిష్యత్తులో నీటి కొరతతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం సూచించే మార్గదర్శకాలను రైతులు, ప్రజలు పాటించాలని కోరారు.

విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

(మొదటి పేజి తరువాయి)

"ఇంద్రకీలాద్రి ఉత్సవాలు సామాన్యుల దసరాగా ఉండాలి, వీఐపీల దసరాగా కాదు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలి" అని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో, వారి రాక వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. వీఐపీల రాకతో విధించే ట్రాఫిక్ ఆంక్షల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయాలని, వారి ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు.అక్టోబర్ 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న 'జాతీయ సరస్ మేళా-2026' దేశానికే ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేళాకు, దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో 208 స్టాళ్లు ఏపీకి చెందినవని అధికారులు వివరించారు. మన రాష్ట్ర మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా గొప్ప వేదిక కావాలని సీఎం అన్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0'ను కూడా ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ వరుస కార్యక్రమాల వల్ల భక్తులు, పర్యాటకుల రాకతో ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సీఎం పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం భయపడుతోంది..

సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ

ఢిల్లీఅక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు.

"ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు.తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు.ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి" అని ఆయన వ్యాఖ్యానించారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

అహోబిలంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు.

మొదటి రోజు తిరుమంజన సేవ



ఆళ్లగడ్డ అక్టోబర్ 11, రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా అహోబిలం గ్రామంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం, మొదటి రోజు తిరుమంజన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి పవిత్ర జలాలతో, వేదమంత్రోచ్ఛారణల నడుమ తిరుమంజన సేవ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ దివ్య సేవను దర్శించుకున్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అహోబిల క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి దివ్య దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో భక్తులలో భక్తిభావం వెల్లివిరిసింది.శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కృపాకటాక్షాలతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

ఆళ్ళగడ్డలో తెలుగు దేశం పార్టీకి భారీ షాక్.





ఆళ్లగడ్డ అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్

ఆళ్ళగడ్డలో తెలుగు దేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆళ్ళగడ్డలోని స్థానిక వైఎస్ఆర్‌సిపి కార్యలయం నందు ఆళ్ళగడ్డ మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డ్ మాజీ కౌన్సిలర్ శ్రీమతి మునగాల మల్లీశ్వరి, మునగాల సంజీవ కుమార్, గుత్తి రంగయ్య, సాత్రి రాజు, దూదేకుల గిరి బాబు, కూరగాయల శ్రీను, యెల్లాలు మరియు సుధీర్ తో పాటు 100 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరశీగా ఆహ్వానించినవైసీపీ కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు మరియు మాజీ శాసన మండలి సభ్యులు శ్రీ గంగుల ప్రభాకర్ రెడ్డి.ఈ కార్యక్రమం లోవిజయ డైరీ చైర్మన్ యస్. వి. జగన్ మోహన్ రెడ్డి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూలూరు నరసింహ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిల్ కౌన్సిలర్ పెట్రోల్ బంక్ సుధాకర్ రెడ్డి, సింగం వెంకటేశ్వర రెడ్డి, క్రిష్ణ రెడ్డి, పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బి సి నాయకులు కులసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.



ఆళ్లగడ్డ అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ క్యాంపు కార్యాలయం లో ఈ రోజు ఉదయం బి సి నాయకులతో, కుల సంఘాల నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే భూమా అఖిల అఖిల ప్రియ సమావేశం నిర్వహించారు ఈ సమావేశం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని
బీసీల రాజకీయ సాధికారతకు, వారి సమగ్రాభివృద్ధికి తెలుగుదేశం పార్టీ మరియు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని ఆళ్లగడ్డ శాసనసభ్యులు శ్రీమతి భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లతో టిక్కెట్లు కేటాయించి వారికి సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు.

నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ముఖ్యమైన బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ... బీసీల రాజకీయ అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన చరిత్ర ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. 1987లో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టి, 1995లో వాటిని 34 శాతానికి పెంచిన ఘనత ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగా టీడీపీదేనని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, బీసీలకు దక్కాల్సిన రాజకీయ హక్కులను మరియు ప్రాతినిధ్యాన్ని అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.మరోవైపు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు తెరవెనుక చేస్తున్న కుట్రలను, వారి నిత్య విద్రోహ, బీసీ వ్యతిరేక వైఖరిని ఆమె తీవ్రంగా ఎండగట్టారు. ఎన్నికల్లో బీసీ వర్గాలకు అన్యాయం చేయాలని చూస్తున్న వైఎస్సార్‌సీపీ కుట్రలను ప్రజలందరూ గమనిస్తున్నారని, ఆ పార్టీకి బీసీల సంక్షేమంపై ఎప్పుడూ చిత్తశుద్ధి లేదని విమర్శించారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రముఖ బీసీ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీల రాజకీయ సాధికారతకు తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ను సన్మానించిన ముస్లిం మైనారిటీ సోదరులు







ఆళ్లగడ్డ అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారానికిఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రత్యేక చొరవతీసుకుంటున్నారు. గతంలో ఆళ్లగడ్డ పట్టణంలోని మసీదు సమీపంలో ఉన్న ఈద్గా, ఖబరస్తాన్‌ను ఎమ్మెల్యే సందర్శించిన సమయంలో సమాధుల వద్ద మట్టి కుంగిపోవడంతో మృతుల కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమస్యను పరిష్కరిస్తానని అప్పట్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , తన సొంత నిధులతో మట్టి తోలించి అవసరమైన పనులు పూర్తి చేయించారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి కావడంతో ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణం లోని మసీదు కాంపౌండ్ వాల్ నిర్మాణం, అంతర్గత రహదారి ఏర్పాటు వంటి సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఇమామ్‌లకు అనుకూలమైన స్థలంలో నివాస కాలనీ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిపై ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఆళ్లగడ్డ పట్టణం, మండల పరిధిలోని మసీదులకు అవసరమైన కాంపౌండ్ వాల్స్ నిర్మాణం కోసం సుమారు రూ.2 కోట్ల నిధుల మంజూరుకు సంబంధించి సమాచారం అందిందని, దీనిపై మరోసారి అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాననిఎమ్మెల్యే వెల్లడించారు.ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి రూ.21 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ నిధులతో పట్టణంలో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని, జిల్లా స్థాయిలోనే అభివృద్ధిలో ఆళ్లగడ్డ ను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

ఎన్నికల నిర్వహణకు అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలి

అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశం





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 11)

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.
ఈ మేరకు నగర శివార్లలోని అథేనా స్కూల్‌లో ఏర్పాటు చేయనున్న ఎన్నికల కేంద్రాన్ని డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్లు, రహదారులు, మెటల్ రోడ్డు పనులు, పరిసరాల్లో జంగిల్ క్లియరెన్స్ తదితర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం కేటాయించాలని, రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని డీఎస్పీతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.
ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. నిర్దేశిత సమయంలోగా ఏర్పాట్లన్నీ పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు కేంద్రాన్ని సిద్ధం చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో ఎస్ఈ రమణమూర్తి, సీఐలు చంద్రబాబు నాయుడు, తేజోమూర్తి, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకారంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం





బండి ఆత్మకూరు, అక్టోబర్ 11, (రిపబ్లిక్ న్యూస్):- నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారు వెలసిన ఓంకార క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆదివారం ఉమామహేశ్వరి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగ ప్రసాద్ ఆలయ చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, పాలక మండలి సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ,సురేష్ శర్మలు అమ్మవారిని శ్రీ రాజ రాజేశ్వరి దేవిగా అలంకరణ చేశారు. తర్వాత అమ్మవారికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం, మహాకాళి, మహాలక్ష్మి ,మహా సరస్వతి దేవి కలశ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రానికి చేరుకున్న భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

కర్నూలులో కొలువుదీరిన టైటానిక్ ప్రపంచం..

మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి. వెంకటేష్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం!

నగరవాసులకు సరికొత్త వినోదం.. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30కే అద్భుత టైటానిక్ ఎగ్జిబిషన్ సందర్శించే అవకాశం!





కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):

కర్నూలు నగర ప్రజలకు సరికొత్త వినోదాన్ని అందించేందుకు ప్రపంచ ప్రసిద్ధ టైటానిక్ ఎగ్జిబిషన్ కొలువుదీరింది. ఆదివారం సాయంత్రం కర్నూలు మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి టి.జి. వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ఘనంగా ప్రారంభించారు.ప్రపంచ ప్రసిద్ధ టైటానిక్ నౌక చరిత్రను కళ్లకు కట్టేలా భారీ నమూనాలు, ఆకట్టుకునే దృశ్యాలు, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక శబ్ద ప్రభావాలతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సందర్శకులకు టైటానిక్ నౌక చరిత్రను పరిచయం చేస్తూ, సరికొత్త అనుభూతిని అందించేలా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించేలా టికెట్ ధరలను అందుబాటులో ఉంచారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టైటానిక్ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని నిర్వాహకులు ఆహ్వానించారు.
కర్నూలు నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఈ ప్రదర్శన వినోదంతో పాటు చారిత్రక అవగాహనను అందించనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కస్తూరి వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ పరమేష్‌తో పాటు పలువురు ప్రముఖులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

దసరా వేళ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నకిలీ ఈ-చలాన్ ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయొద్దు.. ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 11)

సోషల్ మీడియాలో కనిపించే 'దసరా బిగ్ సేల్', ఆకర్షణీయమైన పండుగ ఆఫర్ల లింకులను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. అటువంటి లింకుల ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు నమోదు చేయకూడదన్నారు. గుర్తుతెలియని ఏపీకే ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చేయడం వల్ల మొబైల్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొనుగోళ్ల కోసం అధికారిక యాప్‌లను మాత్రమే వినియోగించాలని కోరారు.
ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్త:దసరా సెలవుల్లో స్వగ్రామాలకు వెళ్లేవారు ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. నాణ్యమైన తాళాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఊళ్లకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేయండి :సైబర్ మోసానికి గురైనవారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా **www.cybercrime.gov.in** వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. పండుగ వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాలు, దొంగతనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా

మైలేరి సురేఖ ప్రమాణ స్వీకారం

హాజరైన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కూటమి నాయకులు.





ఆళ్లగడ్డ అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఈ రోజు ఉదయం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, ఆళ్లగడ్డ అధ్యక్షులు బోరెడ్డి లక్ష్మి రెడ్డి, జెనసేన నాయకులు నిర్మల భాస్కర్,సురేష్ చౌదరి, సురేషబాబు,ఎనమాల భాస్కర్, పాములపాడు రాము, పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జెనసేన పార్టీ ఆళ్లగడ్డ సమన్వయకర్త మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో కొనసాగింది.మార్కెట్ యార్డ్ సెక్రటరీ నరేష్ మైలేరి సురేఖతో మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ హాజరైనారు. సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూమార్కెట్ యార్డ్ అభివృద్ధి కి పూర్తి సహకారశీ అందిస్తానని స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి విజయానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం మైలేరి మల్లయ్య మాట్లాడుతూ నేను జెనసేన పార్టీలో సామాన్య కార్యకర్తను అయిన నన్ను గుర్తించి నా సతీమణి మైలేరి సురేఖకు మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్ లకు మాకు సహకరించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కు, ముఖ్య నేతలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ మాట్లాడుతూ ఆళ్లగడ్డ ప్రాంతం లోని రైతులకు అందుబాటులో వుంటూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానని వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కి కృషి చేస్తానని చైర్మన్ తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ స్థానిక సమరంలోనూ కూటమి సత్తా చాటుదామని

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే విజయంనాయకులు, కార్యకర్తలు ఒకే కుటుంబంలాకలిసి పనిచేయాలని కోరారు.అఖిలమ్మ అంటేనే ఆళ్లగడ్డ అడ్డా. ఇది కూటమి గడ్డచిట్టచివరి ఎకరాకూ పోలవరం జలాలుఅందిస్తామని కేంద్రం సంపూర్ణ సహకారంఅందిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు.అన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సత్తా ఏంటో మరోసారి చాటి చెప్పాలని, కూటమి అభ్యర్థులను అత్యుత్తమ మెజార్టీతో గెలిపించుకుందామని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తితో స్థానిక సమరానికి సమాయత్తం కావాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎన్డీఏ కూటమికి కంచుకోట అని డాక్టర్ అభిరుచి మధు అభివర్ణించారు. అఖిలమ్మ అంటేనే ఆళ్లగడ్డ అడ్డా. ఇది కూటమికి గడ్డాఅని ఆయన ఉద్ఘాటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలంతా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి అడుగులు వేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ కూటమి అభ్యర్థుల విజయానికి అహర్నిశలు కృషి చేసి, విపక్షాలకు స్థానం లేకుండా చేయాలని ఆయన పిలుపునిచ్చారు.భారతదేశానికి ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణఅని రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రం బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందిఅని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిజమైన రైతు బాంధవుడని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దానికంటే మిన్నగా, అడగనన్ని నిధులను ప్రధాని మోదీ ఇస్తున్నారని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ఆయకట్టులోని చిట్టచివరి ఎకరాకు కూడా సాగునీరు అందిస్తున్నారని , తద్వారా రాష్ట్రం మొత్తం సస్యశ్యామలం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన మైలేరి సురేఖకు, మరియు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లకు లకు శుభాకాంక్షలు తెలిపారు. దళారి వ్యవస్థ లేకుండా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కు సూచించారు.ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, రైతులు,వేల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు అనంతరం వచ్చిన అతిధులు అందరికి మైలేరి మల్లయ్య భోజనాలు ఏర్పాటు చేశారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

గుత్తిలో ఘనంగా కోనేరుప్రక్షాళన

వందలాది మంది స్వచ్ఛంద కార్యకర్తల శ్రమదానం









గుత్తి అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

పట్టణంలోని పురాతన జలవనరుల పరిరక్షణే లక్ష్యంగా పూర్వ సంపద రక్షణ సేన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కోనేరుప్రక్షాళన కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. వందలాది మంది స్వచ్ఛంద కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొని శ్రమదానం చేశారు.

కోనేరులో పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పూజా సామగ్రి అవశేషాలను తొలగించారు. పురాతన జలవనరులను పరిరక్షించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్, రైల్వే శాఖల సిబ్బందితోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత, రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రమదానంలో పాల్గొన్న వారికి పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అల్పాహారం, భోజనం, తాగునీరు, గ్లౌజులు, బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా, గుత్తి మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి, మార్కెట్ యార్డు చైర్మన్ సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, చికెన్ శీన, ఎర్రగుడి రమేష్, డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు మస్తానప్ప, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకురాలు సునీత, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి. విజయభాస్కర్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు వెంకప్ప, సాధన స్కూల్ కరస్పాండెంట్ పిల్లిళ్లే కృష్ణయ్య, గౌతమిపురి యోగా సభ్యుడు కృష్ణయ్య గుత్తి కోట సంరక్షణ సమితి సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, బిల్లేకల్లు రంగనాథరావు, మాకం రంగనాథ్, వలి సాహెబ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు వెంకటరామిరెడ్డి, దేశయి నాగరాజు, శ్రీధర్ గౌడ్, ఓబులేసు, సుధాకర్ బాబు, సమితి ప్రచార కన్వీనర్ గగారిన్, సహాయ కార్యదర్శి వీరేష్, సంరక్షణ యువజన సమితి కన్వీనర్ హెచ్.ఎం. జీలాన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పామిడి, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి కూడా స్వచ్ఛంద కార్యకర్తలు తరలివచ్చారు.

రైల్వే శాఖ తరఫున సీనియర్ డీఎంఈ రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ మంజునాథ్, సిబ్బంది పరంజ్యోతి పర్షి, రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, సత్యరాజ్ పాల్గొన్నారు. మున్సిపల్ శాఖ తరఫున శానిటరీ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, శానిటరీ సెక్రటరీలు రాజేంద్ర, కుమార్, దుర్గాప్రసాద్, శివగంగాధర్, సురేష్, మురళి తదితరులు సేవలందించారు. గుత్తి సీఐ రామారావు, పూర్వ సంపద రక్షణ సేన కార్యకర్తలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక యువత కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

పురాతన జలవనరుల పరిరక్షణ అందరి బాధ్యత

పురాతన కోనేరులు, బావులు, చెరువులు చారిత్రక వారసత్వానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకలని నిర్వాహకులు పేర్కొన్నారు. వాటిని పరిశుభ్రంగా ఉంచడం, పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇటువంటి సేవా కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పురాతన జలవనరుల పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

గుత్తిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానం



గుత్తి అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ అవార్డు గ్రహీత, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి. విజయభాస్కర్, కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత ఎద్దుల సూర్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాకం శ్రీకాంత్ మాట్లాడుతూ గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు విజయభాస్కర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కోట చరిత్ర, ప్రాశస్త్యం, సంరక్షణపై ఆయన ప్రచారం చేస్తూ లఘుచిత్రాలు, పుస్తకాల ద్వారా యువతలో అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఎద్దుల సూర్యనారాయణరెడ్డి సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కిషోర్ కుమార్, గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు వెంకటరామిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ బాబు, శివ, కవిత విజన్ కేర్ నిర్వాహకుడు జి. ఓబులేసు, గగారిన్, ఆర్యవైశ్య మహిళా మండలి కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఒక్కటైన ప్రేమజంట

అంబేద్కర్ విగ్రహం సాక్షిగా హిందూముస్లిం వివాహం



ఎమ్మిగనూరు, అక్టోబర్, 11,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)

నందవరం మండలం హోలహర్వి గ్రామానికి చెందిన షేక్షవలి, మాల శాంతి ప్రేమించి, పెద్దల అంగీకారం లభించకపోవడంతో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో వివాహం చేసుకున్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా వివాహం నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి. రంగయ్య మాట్లాడుతూ కులమతాల కంటే మానవత్వం గొప్పదని, ఇలాంటి ఆదర్శ వివాహాలు సమాజంలో సమానత్వం, సామరస్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు పరమేష్, మల్లేష్, వీరేష్, గ్రామ పెద్దలు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

రాష్ట్రంలో చంద్రబాబు దాష్టీక పాలన

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారు -వైఎస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 11)

రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ దాష్టీక పాలన కొనసాగుతోందని వైఎస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.ఆదివారం వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలతో భూమన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గట్టిపోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు.

బీసీలకు రిజర్వేషన్ల పేరుతో మోసం

బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, రిజర్వేషన్ల విషయంలో వెన్నుపోటు పొడిచారని భూమన ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల్లో వారికి పెద్దపీట వేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం బీసీలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు.

175 నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధం

రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ బలంగా ఉందని భూమన పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వారం రోజుల ముందే వైఎస్సార్సీపీ అభ్యర్థులను ప్రకటించిందని, దీనిపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. నెల్లూరు సిటీని జనరల్ స్థానంగా మార్చారని పేర్కొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు

చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేస్తామని భూమన తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సుమారు రూ.3 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ వైఎస్సార్సీపీ బలంగా పనిచేస్తోందని, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టమైన ఎన్నికల యంత్రాంగంతో పోటీ చేస్తామని చెప్పారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఆలస్యంగా జారీ చేసే అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబు కుట్రలను ఎదుర్కొంటూ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సాయి ప్రసాద్, పార్టీ ఇన్‌చార్జులు రాజీవ్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, మాజీ కుడా వైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే కరువు మండలాల ప్రకటనలో జాప్యం!

పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపణ .. రెండో విడతలోనైనా పంట నష్టం వివరాలు పంపాలని డిమాండ్



ఎమ్మిగనూరు , అక్టోబర్, 11,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)జిల్లా అధికారుల తీరుతోనే ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు ప్రాంతాల్లోని మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించడం లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపించారు. వర్షాభావం, ఎల్ఎల్సీ ద్వారా సాగునీరు అందక పశ్చిమ ప్రాంత రైతులు వలసలు వెళ్తుంటే, పంటలు బాగున్నాయని నివేదికలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఎల్ఎల్సీ కాలువకు నీటి వాటా కోసం ఇండెంట్ పెట్టకపోవడంతోనే తుంగభద్ర జలాశయం నుంచి సాగునీరు అందడం లేదని ఆరోపించారు. వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఎకరాల వారీగా పంటల వివరాలు ఉన్నప్పటికీ, ఎండిపోయిన పంటల నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కనీసం రెండో విడతలోనైనా పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపి, కరువు మండలాలుగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు మండలాల ప్రకటనలో జాప్యం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారుతోందన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, మంజునాథ్, నర్సింలు, కర్రెన్న తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌కు ఘన స్వాగతం

ఈటీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్



మల్లాపూర్ అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)

కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ తో కలిసి దుబాయ్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గానికి చెందిన ఎం.ఎల్.జీ కంపెనీ వ్యవస్థాపకుడు గోనె మురళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ఈటీసీ ఆధ్వర్యంలో దుబాయ్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉంది. పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ ఆట పాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుంది.

విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సైతం బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించడం ద్వారా తమ మాతృభూమి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తున్నారు. దుబాయ్‌లో నిర్వహించిన ఈ వేడుకలు ప్రవాస తెలంగాణ ప్రజల్లో పండుగ వాతావరణాన్ని నింపాయి.

దుబాయ్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యేను జగిత్యాల జిల్లా మరియు కోరుట్ల నియోజకవర్గ గల్ఫ్ కార్మికులు, దీతీం చీ=× విభాగం బాద్యులు, డా. సంజయ్ అభిమానులు పలువురు దీతీం పార్టీ నాయకులు పాల్గొని మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనుక సంజీవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ సాధికారతే కూటమి లక్ష్యం

స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం : డాక్టర్ మాచాని సోమనాథ్



ఎమ్మిగనూరు, అక్టోబర్, 11,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)

బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సెల్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ మాచాని సోమనాథ్ అన్నారు. ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమన్నారు.చట్టపరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే ప్రయత్నాలను వైసీపీ కోర్టుకు వెళ్లి అడ్డుకుందని ఆరోపించారు. అయినప్పటికీ పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు ప్రకటించడం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మద్దతు తెలపడం బీసీల పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు.కూటమి ప్రభుత్వ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేక వైసీపీ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు లభించే అవకాశాన్ని అడ్డుకునేందుకు వైసీపీ అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ప్రజలు వైసీపీని నమ్మే పరిస్థితి లేదని సోమనాథ్ అన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

మైతపూర్ ఘనేగుట్ట గిరి పర్వతం పైన ఘనంగా ప్రారంబమైన కనకా దుర్గ నవరాత్రులు

-భక్తుల సౌకర్యం కొరకు ఉచిత బస్సు ప్రతిరోజు అన్న ప్రసాదం ఆలయ నిర్వహకులు





రాయికల్ మండలం రాయికల్,11(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లాలో ని రాయికల్ మండలం మహితపూర్ గ్రామములో ఉన్న ఘన్నే గుట్ట పైన ఉన్న మరో విజయవాడ కనకదుర్గ అమ్మవారి నవరాత్రులు ఉత్సవాలు ఎంతో వైభవంగా ఘనంగా ప్రారంభం అయినవి

ఈ ఉత్సవాలా సందర్భంగా కనకదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహం ను ట్రాక్టర్ రాతములో పెట్టి గుట్ట నుండి గ్రామములో కి తీసుకోని వచ్చి మొదటగా హనుమాన్ మందిరం వద్ద పూజలు చేసి గ్రామములో పలు విధుల నుండి ఉత్సవ విగ్రహరథం ను తిసుకొని వాడలనుండి ఊరేగింపు చేయగా గ్రామములోని మహిళలు అందరు మంగాలా హరతులతో స్వాగతం పలికి అందరు



హరతులు ఇచుకుంటూ అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టుచు మొక్కినారు ఉత్సవాలు దసరా వరకు అమ్మవారు ప్రతి రోజుకు ఒక్క అవతారం అలంకరణ చేసి ఎంతో ఘనంగా చూడ ముచ్చటగా కనుల విందుగా అందంగా ఉంటుందని నవరాత్రులు జరుగుతున్న సందర్భంగా వచ్చిన వారందరికీ ప్రతి రోజు అన్న ప్రసాదం ఉంటుందని అలాగే నవరాత్రి ఉత్సవాలు ముగిసేవరకు ప్రతి రోజు ప్రగతి హైస్కూల్ నకు చెందిన స్కూల్ బస్సు గ్రామములో ని గంప అనందం కిరణం వద్ద నుండి ఉచితంగా బస్సు సౌకర్యం పోను రాను కల్పించబడిందని తెలిపారు. కావున ప్రతి రోజు గ్రామములో ని ప్రజలు భక్తులు అందరు ఉచిత బస్సు ను ఉపయోగిశీచు కోవాలని కోరారు ఈ ఉత్సవాల సందర్భంగా గ్రమంలో ని మహిళలు,మరియు దీక్షలు స్వికరించిన స్వాములు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాడ్యమి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ

స్వామి వారికి పంచామృత అభిషేకం, ముడుపు సమర్పణ







రాయికల్ మండలం అక్టోబర్,11(రిపబ్లిక్ న్యూస్)

ఆదివారం (భానువాసరే ఆశ్వీయుజ మాసం శుక్ల పక్షం పాడ్యమిపర్వదినం సందర్భంగా సూర్య ధన్వంతరి

ఉషా చాయ సమేత సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకంసూర్య భగవానుని విశిష్టత

ఆదివారం సూర్య భగవానుని ప్రత్యేక దినంఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియపర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, పంచామృత అభిషేకాలు, సామూహిక ఆదిత్య హృదయం పారయాణం అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు ఈ కార్యక్రమములోఫౌండర్ &ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్,సహాయ కోశాధికారి గోపి,మేనేజింగ్ ట్రస్టి గట్టు రాజేందర్,భరతాల రాజసాగర్,వోడ్నాల తిరుపతి -సునీత,చిక్కి,చెన్నూరి శ్రీధర్ -సరోజన, మల్లేశ్వరి, గంగాధర్ -జయలక్ష్మి,,వేముల రాజేష్-మేఘన,హరి కృష్ణ -శ్రీ లక్ష్మి, కొక్కు తిరుపతి,యాంసాని శంకరయ్య, హరీష్, అడ్లగట్ట రవీందర్,అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు.

తల్లెం భరత్ కుమార్ రెడ్డి.- ఉచిత వైద్య శిబిరం ప్రారంభం









రైల్వే కోడూరు అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్.

వైఎస్సార్ సీపీ అగ్రనాయకులు, మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామంలో అత్యంత వైభవంగా వైఎస్సార్ సీపీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు, గుంతకల్లు డి ఆర్ యు సి సి సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి,ఈ వేడుకలను నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని ఘనంగా నిర్వహించారు.జన్మదిన వేడుకల్లో భాగంగా తెల్లవారుజామునే స్థానిక గ్రామదేవత శ్రీ కటాపుటాలమ్మ దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరున, వారి గోత్రనామాలతో అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దైవకార్యం ముగిసిన వెంటనే సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో తల్లెం భరత్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన అప్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, బీపీ షుగర్ కంటికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు (ఆపరేషన్లు) చేయించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ప్రయోజనకరంగా నిలిచిందని, స్థానిక ప్రజలు నాయకులు భరత్ కుమార్ రెడ్డి ని అభినందించారు, వైద్య శిబిరం అనంతరం అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో కోలాహలంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ శుభసందర్భంలో పాల్గొన్న వారందరికీ కేక్ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మంగంపేట గ్రామ పంచాయతీ అభివృద్ధికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. మంగంపేట ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి ఆదుకున్న మహోన్నత వ్యక్తి అని, ఆయన నాయకత్వంలో గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి గారి ప్రజాసేవా తత్పరత, దైవభక్తి ఇలాగే నిరంతరం కొనసాగాలని, ప్రజలందరి ఆశీస్సులు, దీవెనలు ఆయనపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఓరుగంటి అనిల్ స్వామి రైల్వే కోడూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి వాణిజ్యవిభాగం అధ్యక్షుడు గున్ని శెట్టి రమేష్, వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు మంగంపేట గ్రామ కమిటీ అద్దె వెంకటేష్, వైఎస్ఆర్సిపి మంగంపేట గ్రామ కమిటీ స్టూడియో అధ్యక్షుడు పోలీసు కుమార్ రెడ్డి, మంగంపేట గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి వైఎస్ఆర్సిపి కవులూరి సుబ్రహ్మణ్యం రెడ్డి, త్రివేదిరెడ్డి శంకర్ రెడ్డి,రమణారెడ్డి సుబ్బారెడ్డి, చంద్రయ్య, రామచంద్ర రెడ్డి,చైతన్య, సుంకమ్మ,అనుమక్క,సుంకమ్మ శ్రీరాములు, రాముడు, లక్ష్ముడు,చంద్రుడు,రైతు కార్యదర్శి లింగన్న శ్రీకాంత్,స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో విచ్చేసిన అభిమానులు మరియు గ్రామస్థుల కోలాహలంతో మంగంపేటలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, హరే కృష్ణ నేత్రాలయ సౌజన్యంతో నిర్వహించడం జరిగినది, డాక్టర్ అర్జున్, దీనా కుమార్,చరణ్, రోహిణి,ఆర్షి ,మరియు హరే కృష్ణ నేత్రలయ మార్కెటింగ్ వెంకటేష్,విష్ణు పాల్గొన్నారు.

రాయికల్ మండల క్రికెట్ టోర్నమెంట్ కట్కాపూర్ టీంకు టీ షర్టు స్పాన్సర్ చేసిన సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి



రాయికల్ మండలం అక్టోబర్,11(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న సందర్భంగా దిశా కమిటీ మెంబర్ ధావన్ పల్లి బిక్కు కోరిక మేరకు టీ షర్ట్స్ స్పాన్సర్ చేయడం జరిగింది అని కట్కాపూర్ గ్రామ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి అన్నారు ఈ సందర్భంగా పడాల పూర్ణిమ తిరుపతి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అందరిని ప్రోత్సహించాలని వారు సూచించారు ఈ కార్యక్రమానికి హాజరై క్రికెట్ ఆడుతున్న టీములను అభినందించడం జరిగింది

పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి : బెక్కం జనార్ధన్

ఓటరు నమోదు ప్రజాస్వామ్య బలోపేతానికి తొలి అడుగు!



రాయికల్ మండలం అక్టోబర్11(రిపబ్లిక్ న్యూస్)



జనసేన పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నియోజకవర్గ పీఏోసీలతో జనసేన పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కోఆర్డినేటర్ బెక్కం జనార్ధన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన జనసేన పార్టీ ఫామ్ 18 క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.అనంతరం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎన్రోల్మెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా చేపట్టారు.

మల్లాపూర్‌లో ఘనంగా నవదుర్గ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మల్లాపూర్ అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)



మల్లాపూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన నవదుర్గ సమితి ఆధ్వర్యంలో దుర్గ మాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని నంది చౌరస్తా నుండి పాత బస్టాండ్ భరతమాత విగ్రహం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు, అన్ని కులాల పెద్ద మనుషులు, యువకులు, మాల స్వీకరించిన మాలదారులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో అమ్మవారి విగ్రహ దాతలుగా మొరపు జలపతి-లక్ష్మి దంపతులు, పంచలోహ విగ్రహ దాతలుగా తోట రాజారం-సరస్వతి దంపతులు నిలిచారు. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా, అర్చకులు బాల్యపెల్లి సోమేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది భక్తులు కంకణధారణ చేసి అమ్మవారి మాల స్వీకరించారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో జరిగే ఈ ఉత్సవాల్లో బుధవారం బోనాలు, గురువారం మహా అన్నదానం, శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు నవదుర్గ సేవాసమితి సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని, దాతలు ఎవరైనా దన రూపేణా, దాన్య రూపేణా, వస్తు రూపేణా సహాయం అందించాలని కోరారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆళ్లగడ్డ అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామం సమీపంలో గల హిందూ స్మశాన వాటిక ఎదురుగా ఆదివారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో శిరివెళ్ల మండలం యర్రగుంట్ల కోట బురుజు ఏరియాకు చెందిన మేకల జాకీర్ మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శిరివెళ్ల పోలీసులు తెలిపారు.

పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు.. గౌరవమే లక్ష్యం!

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసినకాటసాని రామభూపాల్ రెడ్డి



కల్లూరు ప్రతినిధి, అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తెలిపారు. కల్లూరు అర్బన్ 26వ వార్డు మాజీ కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను కాటసాని రామభూపాల్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కష్టకాలంలోనూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్త సేవలను గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో గుర్తింపు కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పునాదులని, వారి కృషి, సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మండల నాయకులు, కల్లూరు అర్బన్ 26, 27వ వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెదిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు





చౌడేపల్లి ప్రతినిధి అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్ మండల కేంద్రమైన చౌడేపల్లి గ్రామీణ ప్రాంతాలలో రాష్ట్ర మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఆ పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యుడు పవన్ రాయల్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు యానాది కాలనీలలో అన్నదానం యానాదులు వారి పిల్లలకు వస్త్ర దానాలు చేశారు. మండల వైకాపా అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో కొలింపల్లి క్రాస్ వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుటుంబ సభ్యులు చేసిన సేవలను అందరికీ వివరించారు రాబోయే ఎన్నికలలో వైకాపా అన్ని స్థానాలలోనూ గెలుచుకుంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రామచంద్రారెడ్డి మరిన్ని పదవులు అలంకరించి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్, దామోదర్ రాజు, సుధాకర్ రెడ్డి, కూరపర్తి అంజిబాబు,రుక్మిణమ్మ , కళ్యాణ్ భరత్ ,అనుప్రియ లావణ్య,శ్రీరాములు, జంగాలపల్లి రమణ, తానధర్ నాగరాజా, సుబ్రమణ్యం రాజు, అల్తాఫ్, భాస్కర్ ,హరీష్, గిరి ,రామ్ కి, మంజునాథ్ ,తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట తారకరామ నగర్ లో అప్పుల బాధ, మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య...

రేణిగుంట అక్టోబర్ :11(రిపబ్లిక్ న్యూస్)



రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామ నగర్‌లో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళితే...తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, సిద్దవరం గ్రామానికి చెందిన పెయ్యాల గోవర్ధన్, సుబ్బలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు పెయ్యాల బద్రి (26). ఇతనికి సుమారు ఆరేళ్ల క్రితం కావమ్మ అనే మహిళతో వివాహమైంది. వీరికి లోకేష్ వర్ధన్ (3) అనే కుమారుడు ఉన్నాడు. బద్రి తన కుటుంబంతో కలిసి రేణిగుంట మండలం, తారకరామ నగర్‌లో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు.కొంతకాలంగా బద్రి మద్యానికి బానిసగా మారి, సరిగ్గా ఆటో నడపకుండా ఖాళీగా ఉంటూ భారీగా అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 09-10-2026న భార్య కావమ్మ తన చెల్లెలి ఇంటికి వెళ్లడంతో బద్రి ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శనివారం (10-10-2026) సాయంత్రం భార్యతో ఫోన్‌లో మాట్లాడిన బద్రి, ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఎదురింట్లో ఉండే మురళి అనే వ్యక్తికి సమాచారం ఇవ్వగా, అతను వెళ్లి చూసేసరికి ఇంటి లోపల సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని బద్రి మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు.

మద్యానికి బానిసై, చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది బద్రి ఆత్మహత్య చేసుకున్నట్లు అతని తల్లి పెయ్యాల సుబ్బలక్ష్మి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు ప్రారంభించారు.

శ్రీ బుగ్గ రామేశ్వర స్వామిని దర్శించుకున్న ఏపీ లోకాయుక్త జడ్జి ఏసీ మల్లికార్జున రావు

బుగ్గ రామేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక దర్శనం.. ఆధ్యాత్మిక వాతావరణంలో ఆలయ సందర్శన

ఓర్వకల్లు ప్రతినిధి, అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):



ఓర్వకల్లు మండలంలోప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి ఏసీ మల్లికార్జున రావు గారు ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.ఆలయానికి విచ్చేసిన ఏసీ మల్లికార్జున రావు గారికి దేవస్థానం ఆధ్యాత్మిక విశిష్టత, ఆలయ ప్రాధాన్యతను వివరించారు. ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకున్న ఆయన ఆలయ సందర్శనను పూర్తిచేశారు.చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ పుణ్యక్షేత్రాన్ని ఉన్నత న్యాయాధికారి సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సందర్శనతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

100 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు ఎన్ఓసీ ఇవ్వాలి!

బొడ్డువానిపల్లె రైతుల భూములను పరిశీలించిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం

ఓర్వకల్ ప్రతినిధి, అక్టోబర్ 11(రిపబ్లిక్ న్యూస్)



బొడ్డువాని పల్లె మజరా బైరాపురం గ్రామం ఓర్వకల్ మండలం, కర్నూలు జిల్లా గ్రామస్తులు ఎన్నో ఏళ్ళు గా సుమారు 100 సంవత్సరాల పై బడి సాగు అనుభవ భూములను సర్వే అనుభవ భూముల గురించి ణఖీూ కి చీూజ కోరుట గురించి. కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం బైరాపురం గ్రామ శివారు బొడ్డువాని పల్లె (ఖఅఅఅష్ట్రుఎఱ్ఱవఁ) పరిధిలో రెవెన్యూ & ఫారెస్ట్ సరిహద్దు విషయమై ఉన్న రైతుల భూములను బిఆదివారంబి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం గారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం గారు సిపిఐ ఓర్వకల్ మండల కార్యదర్శి రమేష్ రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ లు మాట్లాడుతూ,

సర్వే నంబర్లు:181, 192, 166, 498, 274/1, 142, 215, 155, 258, 157, 170, 180, 182, 184, 197, 199, 200, 220, 216, 217, 204, 247, 255, 267, 257, 262, 264, 260, 251, 259, 266, 268, 270, 271, 273, 275, 285, 482, 144, 145, 146, 147, 148/3 తదితర సర్వే నంబర్లలోని సుమారు 150 ఎకరాల్లో 58 కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి.

ఈ భూములకు కర్నూలు ఫారెస్ట్ అధికారులు, ఓర్వకల్ వీ=ా, సర్వేయర్, ఎ=ా లతో కలిసి 19/01/2026, 28/01/26, 26/02/26, 27/02/26, 28/02/26, 04/08/2026 తేదీలలో Joint Survey È Resurvey నిర్వహించారని, అయినా ఇప్పటి వరకు చీూజ ఇవ్వలేదని రైతులు జగన్నాథం గారికి విన్నవించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీశీఱత్ సర్వే, రీసర్వే పూర్తి అయినందున అన్నింటిని పరిగణలోకి తీసుకుని గౌరవ MRO, DFO సాగు అనుభవ హక్కులు



కలిపించి ప్రతి రైతుకు పట్టా పాస్ పుస్తకాలు మంజురు చేసి ఆన్లైన్ అదంగల్ నమోదు చేయాలనీ బైరాపురం గ్రామస్తులు ఉన్నత అధికారులకు తెలియ చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు సిపిఐ నాయకులు రాజు అయ స్వామి కల్లూరు మండల కార్యదర్శి రాముడు సిపిఐ నాయకులు ఆంజనేయులు రవికుమార్, మక్బూల్, మహబూబ్ భాషా, జాస్వ, రాజీవ్, శ్రీనివాసులు, పాపులు, కృష్ణుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు మండలానికి చెందిన వైసిపి నుండి. టీడీపీలోకి 30 కుటుంబాలు చేరిక

గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీలో చేరికలు.. కండువాలు కప్పి ఆహ్వానించిన గౌరు దంపతులు

ఓర్వకల్లు ప్రతినిధి,అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):



ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. మాధవి నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారందరికీ గౌరు దంపతులు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీలో చేరిన వారుఓర్వకల్లు మండలానికి చెందిన ఆశ భాష, పి. షేక్షా వలీ, ఆంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు, కే. బాలకృష్ణ, చరణ్, స్వాములు, సురేశ్, గణేష్, మహేశ్, లావణ్య, రేణుక, మహేశ్వరి, వెంకటేశ్వరి, మా భాష, పి. మదర్ బి, ఇంతియాజ్, మొల్ల మహబూబ్ భాష, సామ్యూల్, నాగయ్య, శశ భాష, పెద్ద పుల్లయ్య, ఆదాము, మోహన్, నజీర్, మోహన్, మధు తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల టీడీపీ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రామ భూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యేసోబు, ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే.



పార్వతమ్మ, ఏపీ కార్పొరేషన్ డైరెక్టర్ గంజాయి నాగముని తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వారిని గౌరు దంపతులు అభినందిస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.

బాధితులకు భరోసా గా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ.

కూడా చైర్మన్ రూపానంద రెడ్డి.

రైల్వే కోడూరు అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్.



బాధితులకు భరోసాగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం బాధితులకు పంపిణీ చేయడం జరిగినది, ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి లోని కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి ఇంటి ఆవరణలో అట్టహాసంగా చెక్కుల పంపిణీ ఆయన సతీమణి రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, జనసేన పార్టీ రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ తో కలిసి పంపిణీ చేయడం జరిగినది రైల్వేకోడూరు చిట్వేలి ఓబులవారిపల్లి పుల్లంపేట పెనగలూరు మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు ముక్కవారిపల్లి లో జరిగిన కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన లబ్ధిదారులను ఒకే వేదిక మీదికి చేర్చి అందజేయడం జరిగినది ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని, నిరుపేదల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో రైల్వేకోడూరు నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి 16 కోట్ల రూపాయలు రైల్వేకోడూరుకి హెచ్చించడం జరిగినదని అన్నారు,ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రూ. 1.40 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత చొరవ తీసుకొని రైల్వేకోడూరు నియోజకవర్గానికి భారీగా నిధులు ఇవ్వడం జరిగినదని ఇంతవరకు రెండు వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగినదని ప్రస్తుతం 45 కోట్ల రూపాయలు జిల్లా కలెక్టర్ మంజూరు చేయడం జరిగినదని నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు, రోడ్లు డ్రైనేజీ



సిసి రోడ్లు వీధి దీపాలు స్కూల్స్ ఇతరత్రా కార్యక్రమాలకు నిధులు హెచ్చించి అభివృద్ధి చేయడం జరిగినది అన్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ్యులు అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి చేతుల మీదుగా అర్హులైన బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్, టీడీపీ ఇన్చార్జ్ రూపానంద్ రెడ్డి-వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అత్యవసర వైద్య సేవలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని, ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల ప్రాణాలను కాపాడే సంజీవనిలా మారిందని టిడిపి నాయకురాలు వరలక్ష్మి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ సహాయ నిధిని వేగవంతంగా లబ్ధిదారులకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాష్, టీడీపీ సీనియర్ నాయకులు నీలకంఠయ్య, పాటూరు శ్రీనివాసులురెడ్డి ఉమ్మలరాజు సుబ్బరాజు తో పాటు పలువురు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సాయం అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ముక్కా కుటుంబానికి, ఎమ్మెల్యే శ్రీధర్ కి సహకరించిన

నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

.....

30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన.

జీవిపురం శివాలయం నుండి కనెక్టివిటీ తారు రోడ్డు వరకు సిసి రోడ్డు నిర్మాణానికి 30 లక్షల వ్యయంతో ఆదివారం కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి తెలుగుదేశం నాయకురాలు ముక్కా వరలక్ష్మి, రైల్వే కోడూరు జనసేన శాసనసభ్యులు అరవ శ్రీధర్ లు భూమిపూజ చేసి టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు ఈ రోడ్డు నిర్మాణం వల్ల జీవిపురం,గాదెల తల్లెంవారిపల్లె నుండి వారి మండల కేంద్రానికి వెళ్లేందుకు రైతులకు, రవాణా సౌకర్యం మెండుగా ఉంటుందని, ప్రజలకు సౌకర్యంగా రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని సందర్భంగా టిడిపి నాయకురాలు ముక్కా వరలక్ష్మి అన్నారు, ఎమ్మెల్యే ఆర్వ శ్రీధర్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల్లో భాగంగా సిసి రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు అనువుగా ఉంటుందని స్థానిక నాయకుల ప్రజల కోరిక మేరకు నిర్మించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రఘునాథ రెడ్డి, మల్లికార్జున రెడ్డి,జయప్రకాష్, ఓబిలి శ్రీధర్ రెడ్డి, పున్నాటి వాసుదేవ్ రెడ్డి, సామాజిక కార్యకర్త టిడిపి సీనియర్ నాయకుడు వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, మైనారిటీ నాయకుడు జమీర్‌అక్బర్ బాషా, బండి రమణ, పనింద్ర వెంకటేశ్ ఆచారి, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

-ఎల్-నినో ప్రభావం, ప్రస్తుత పంటల సంరక్షణ పై ముఖ్య మంత్రి మార్గదర్శనం

-యాసంగి సాగు ప్రణాళిక పై రైతులతో ముఖాముఖి

రాయికల్ మండలం అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)



రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం, అక్టోబర్ 12న ఉదయం 11:30 గంటల నుంచి రైతులతో నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.ఎల్-నినో ప్రభావం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల సంరక్షణ, రాబోయే యాసంగి సీజన్‌లో పంటల సాగు ప్రణాళికతో పాటు వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ సంబంధిత అంశాలపై మార్గదర్శనం చేయడంతో పాటు, వారితో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కలిగిన అన్ని రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు

జిల్లాలోని మండల అధికారులు, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన రైతు వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ముందుగానే రైతు వేదికలకు చేరుకుని, కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ముందస్తుగా సమాచారం అందించి, వారు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, యాసంగి పంటల సాగు ప్రణాళికపై మార్గదర్శనం అందనున్న నేపథ్యంలో రైతుల భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

దీపావళి కానుకగా ‘రామాయణం: పార్ట్ 1‘.



భారత సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం ‘రామాయణం: పార్ట్ 1‘. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న దీపావళి పండుగకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నవరాత్రుల శుభ సందర్భంగా ఈ ప్రకటన చేస్తూ, చిత్రంలోని ప్రధాన తారాగణంతో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

ఆదివారం నాడు చిత్ర నిర్మాణ సంస్థలు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడించాయి. “ఇది రాముని యుగానికి ఆరంభం“ అనే సందేశంతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్‌లో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యశ్ కనిపించారు. దసరా పండుగ నుంచి సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.‘దంగల్‘ ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ రామాయణ గాథను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మొదటి భాగం 2026లో రానుండగా, ‘రామాయణం: పార్ట్ 2‘ను 2027 దీపావళికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు.భారతీయ పురాణానికి ఆధునిక సాంకేతికతను జోడించి, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 8 సార్లు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న డీఎన్‌ఈజీ (ణచీజు+) సంస్థ దీనికి విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తుండటం విశేషం. ఏ.ఆర్. రెహమాన్‌తో పాటు హాలీవుడ్ లెజెండరీ కంపోజర్ హాన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయనుండగా, హిందీ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనుంది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు ఐమ్యాక్స్ (×హీూశ) ఫార్మాట్‌లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

టాలీవుడ్‌లోకి మరో వారసురాలు..

హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్న శ్రీకాంత్ కుమార్తె మేధ



టాలీవుడ్‌లోకి మరో ప్రముఖ నటుడి వారసురాలు అడుగుపెడుతున్నారు. సీనియర్ నటుడు శ్రీకాంత్, ఒకప్పటి నటి ఊహ దంపతుల కుమార్తె మేధ కథానాయికగా పరిచయం కాబోతోంది. టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థగా ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఈ మేరకు ఆ సంస్థ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది.ఈ చిత్రంలో ‘రాజమండ్రి రోజ్ మిల్క్‘ చిత్రంతో గుర్తింపు పొందిన జై జాస్తి హీరోగా నటిస్తున్నాడు. యువతను ఆకట్టుకున్న ‘30 వెడ్స్ 21‘ వెబ్ సిరీస్ దర్శకుడు పృథ్వీ వనం ఈ ప్రేమకథకు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును చవీవ్‌ప్రతీఅ×అూశీజవ అనే హ్యాష్‌ట్యాగ్‌తో ప్రమోట్ చేస్తున్నారు. “మా మనసులను గెలుచుకున్న ఇద్దరినీ పరిచయం చేస్తున్నాం. ఈ రోజు మీకు వారి పేర్లు తెలుస్తాయి. రేపు వారిని చూసి మీరు కూడా ప్రేమలో పడతారు“ అంటూ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాకుండా ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి‘ ఫేమ్ మహేశ్ బాబు పి ఈ ప్రాజెక్టుకు క్రియేటర్/షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.మేధాకు నటన కొత్తేమీ కాదు. గతంలో అనుష్క ప్రధాన పాత్రలో నటించిన చారిత్రక చిత్రం ‘రుద్రమదేవి‘లో చిన్నప్పటి రుద్రమదేవి పాత్రలో నటించి మెప్పించింది. శ్రీకాంత్ కుమారుడు రోషన్ ఇప్పటికే ‘పెళ్లి సందడి‘, ‘ఛాంపియన్‘ వంటి చిత్రాలతో హీరోగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అతడి సోదరి మేధ కూడా హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుండడం విశేషం.

ఈ కొత్త ప్రేమకథకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను రేపు (అక్టోబర్ 12) ఉదయం 10:26 గంటలకు విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ ప్రకటనతో శ్రీకాంత్ అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



గాయనిగా మారిన ఊర్వశి రౌతేలా.. తొలి ఈడీఎం సింగర్ గా ఘనత!



బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనలోని మరో కొత్త ప్రతిభను బయటపెట్టారు. నటిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు గాయనిగా కొత్త అవతారం ఎత్తారు. ‘హార్ట్ కంట్రోలర్‘ పేరుతో ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ (ఈడీఎం) ట్రాక్‌తో సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. విశేషమేమిటంటే, ఈ పాటకు ఆమె స్వయంగా గాత్రం అందించడమే కాకుండా, సాహిత్యం కూడా సమకూర్చారు.ఈ సందర్భంగా ఊర్వశి తన సంగీత ప్రయాణం గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ అంటే నాకు ఎప్పటినుంచో ఆసక్తి ఉంది. ఒక నటిగా నా ఇమేజ్‌కు అదనంగా కాకుండా, ఈ సంగీతంలోనే ఒక గాయనిగా, రచయిత్రిగా నన్ను నేను చూసుకోవాలనుకున్నాను. బాలీవుడ్ చరిత్రలోనే పూర్తి స్థాయి ఈడీఎం పాటను ఆలపించిన తొలి ప్రధాన గాయనిని నేనే కావడం గర్వంగా ఉంది“ అని ఆమె తెలిపారు.

ఈ పాట టైటిల్ వెనుక ఉన్న అర్థాన్ని కూడా ఊర్వశి వివరించారు. “‘హార్ట్ కంట్రోలర్‘ అనే పదం నా పేరు ‘ఊర్వశి‘ నుంచే వచ్చింది. ఇందులో ‘ఉర్‘ అంటే హృదయం, ‘వశి‘ అంటే నియంత్రించేది. అందుకే ఈ పేరు పెట్టాను. ఈ పాటలో నేను మరో మహిళ గురించి పాడటం లేదు, నా గురించే పాడుకుంటున్నాను“ అని ఆమె స్పష్టం చేశారు. ఈ పాట కేవలం సంగీతం మాత్రమే కాదని, ఇందులో మహాభారత ప్రస్తావన, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కూడా మిళితమై ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తన ఇంటిపేరైన ‘రౌతేలా‘ను కూడా ఉద్దేశపూర్వకంగానే సాహిత్యంలో చేర్చినట్లు చెప్పారు.హాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నిర్మాతలు అస్లాన్, తైమూర్ జూనా, ఓరియంటల్ హౌస్‌తో కలిసి ఈ పాటను రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పాట విన్నవారు మంచి స్పందన ఇస్తున్నారని, ఇకపై ఈ పాట తనది మాత్రమే కాదని, శ్రోతలందరిదీ అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

సన్నీ డియోల్ సరసన ‘సింగ్ సాబ్ ది గ్రేట్‘ చిత్రంతో ఊర్వశి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత ‘సనమ్ రే‘, ‘గ్రేట్ గ్రాండ్ మస్తీ‘, ‘హేట్ స్టోరీ 4‘ వంటి చిత్రాలతో పాటు ‘కాబిల్‘ సినిమాలో ఒక ప్రత్యేక గీతంలోనూ కనిపించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులోనూ బాలకృష్ణ సరసన ‘డాకూ మహారాజ్‘ చిత్రంలో నటించారు. చిరంజీవి ‘వాల్తేరు వీరయ్య‘ చిత్రంలో ఓ ఐటమ్ నెంబర్ లో మెరిశారు.



రవితేజ ‘తులాభారం’

మాస్ మహారాజ రవితేజ హీరోగా, వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఓ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో సినిమా అంటేనే అభిమానులు ఏ రేంజ్‌లో అంచనాలను పెంచుకున్నారు. రవితేజ 78వ సినిమా తెరకెక్కుతున్న ఈ చిత్రం టైటిల్‌ని ఆదివారం అనౌన్స్ చేశారు. ఇందుకు సంబంధించి ‘టైటిల్ డాక్యుమెంటరీ’ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో సినిమాలో రవితేజతో పాటు హీరోయిన్లు ప్రియాంక మోహన్, అనస్వర రాజన్‌తో పాటు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న జెడి చక్రవర్తి, తరుణ్ భాస్కర్, అనిల్ కరెల్లా, రవి అంటోనీలతో సినిమాకి టైటిల్ ఏది బాగుంటుందనే చర్చ మనం చూడొచ్చు. ఒకరు క్రైమ్ థ్రిలర్ అని, మరొకరు పొలిటికల్ డ్రామా అని, ఇంకొకరు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, లవ్ స్టోరీ అని చెబుతూ వస్తారు. చివరకు అన్నిటిని బ్యాలెన్స్ చేస్తూ.. బ్యాలెన్సే ఈ సినిమా టైటిల్ అయితే బాగుంటుందని ఓ నిర్ణయానికి వస్తారు. ఫలితంగా ఈ సినిమాకి ‘తులాభారం’ అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు. ఇక ఈ సినిమా నటిస్తున్న వాళ్ల పాత్రలను కూడా పరిచయం చేశారు. ఇక ఈ సినిమాని బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లక్ష్మణ్, శ్రీని రావు నిర్మిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది

లుక్ మార్చిన నాని..

‘బ్లడీ రోమియో’గా మారిపోయారు..



రీసెంట్‌గా ‘ది ప్యారడైజ్’ సినిమాతో గ్రాండ్ సక్సెస్‌ని అందుకున్నారు నాని. ఇప్పుడు ఆయన తన తదుపరి సినిమా కోసం రెడీ అవుతున్నాడు. సుజీత్ దర్శకత్వంలో నాని నటించబోయే మూవీ ‘బ్లడీ రోమియో’. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ పతకాలపై వెంకట్ బోయనపల్లి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించి నాని పాత్ర లుక్ టెస్ట్ చేశారు. దసరా కానుకగా ఈ లుక్‌ను విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తోంది. పండగ తర్వాత సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ మూవీని వచ్చే ఏడాది ప్రారంభం నాటికి పూర్తి చేసి.. వేసవికి థియేటర్లలోకి తీసుకురావాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబు కానున్న ఈ సినిమాలో నాని గ్యాంగ్‌స్టర్ పాత్రలో అలరించనున్నారు